క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన యూత్ లీడర్లు



జగన్‌తో సందీప్‌నాయుడు, సతీష్‌చౌదరి

పుట్టపర్తి టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు సందీప్‌నాయుడు, సతీష్ చౌదరి బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని వివరించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని జగనన్న భరోసా ఇచ్చారని వారు తెలిపారు.

సర్పంచుకు అభినందన



కలెక్టర్ చేతన్‌కు అవార్డును చూపుతున్న సర్పంచ్ పంచరత్నమ్మ

నల్లచెరువు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌గా జాతీయ స్థాయి అవార్డు అందుకున్న నల్లచెరువు మేజర్ పంచాయితీ సర్పంచ్ పంచరత్నమ్మను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అభినందించారు. బుధవారం సర్పంచ్ కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు. పంచరత్నమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నల్లచెరువు మేజర్ పంచాయితీలో పక్కాగా అమలు చేశామన్నారు. కార్యక్రమంలో డీపీఓ సమత, డీఎల్‌పీఓ అంజనప్ప, ఈఓఆర్‌డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి నరేష్, సర్పంచ్ భర్త ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కదిరి అర్బన్: కాళసముద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ పోలప్ప బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో సమస్యలపై అని ఆరా తీశారు. ఈసందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో తాగునీటి కోసం బోరు, మోటారు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంపీడీఓను కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉచిత ఆన్‌లైన్ సేవలు



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆన్‌లైన్ ఉచిత సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఆన్‌లైన్ అప్లోడ్, ఉపాధ్యాయుల టీఐఎస్, జీపీఎఫ్ తదితర అన్ని రకాల ఆన్‌లైన్ సర్వీసులు సంఘాలతో సంబంధం లేకుండా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఆంజనేయులు, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, హెచ్.రామంజనేయులు, వెంకటకిషోర్ పాల్గొన్నారు.

కొలతల మేరకు పనిచేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బత్తలపల్లి: కొలతల మేరకు పని చేస్తేనే గిట్టుబాటు కూలి లభిస్తుందని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. బుధవారం అప్పరాచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీలతో ఎంత సమయానికి పనికి వస్తున్నారు? ఎన్ని గంటల సేపు పనులు చేస్తున్నారు? కూలి ఎంత పడుతోంది? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలి కనీసం రూ.300 వేతనం దక్కేలా పనులు చేయాలన్నారు. వేసవి ప్రారంభమవుతుండడంతో పని ప్రదేశం వద్ద సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కదిరి అర్బన్: ఎరుకులవాండ్లపల్లి సమీపంలో బుధవారం పేకాట స్థావరంపై రూరల్ మండల పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.7,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



కాలువలు లేకపోవడంతో మట్టిదారిపైనే పేరుకున్న మురుగునీరు



సత్యసాయినగర్‌కు వెళ్లే రహదారికి రెండువైపులా పెరిగిన ముళ్లకంపలు

మౌలిక సదుపాయాలపై మౌనమేల?

- సత్యసాయినగర్, గిర్రాజుకాలనీల్లో సమస్యల తిష్ట
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

ధర్మవరం అర్బన్: మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలోని 31వ వార్డు పరిధిలోకి సత్యసాయినగర్, గిర్రాజుకాలనీ వస్తాయి. నాలుగు వేల జనాభా.. మూడు వేల ఓటర్లు కలిగిన ఈ రెండు కాలనీలు గతంలో పోతుకుంట పంచాయతీ పరిధిలో ఉండేవి. ఎనిమిదేళ్ల క్రితం ఈ రెండు కాలనీలను మున్సిపాలిటీలోకి విలీనం చేశారు. అప్పటి నుంచి అధికారులు కాలనీల్లోని ఇళ్లకు పన్నులు విధించారు తప్ప మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించలేదు. సకాలంలో పన్నులు కడుతున్నా తమ సమస్యలు పట్టించుకునే నాథులు కరువయ్యారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో ఎటు చూసినా గుంతలమయమైన రహదారులు, ఇళ్లముందు మురుగునీరే కనిపిస్తాయి. మున్సిపల్ అధికారులకు విన్నవించినా సమస్యలు తీరలేదు.

చెత్త తీసుకెళ్లే వాహనాలు రావడం లేదు. దీంతో ఇళ్లలోని చెత్తాచెదారమంతా రోడ్లపై పడేస్తున్నారు. సత్యసాయినగర్ కాలనీకి వెళ్లే రహదారికి రెండు వైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో విష పురుగులు తిరుగుతున్నాయి.

నెలైనా డ్రైయినేజీలు శుభ్రం చేయరు



కాలనీలో ఉన్న డ్రైయినేజీలను నెలరోజులు అయినా మున్సిపల్ కార్మికులు శుభ్రం చేయడం లేదు. దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి దుర్వాసన వస్తుండటంతోపాటు చిన్నపిల్లలు రోగాలబారిన పడుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వారానికోసారి అయినా కాలువలను శుభ్రం చేస్తే బాగుంటుంది.

– సూర్యనారాయణరాజు, సత్యసాయినగర్, ధర్మవరం

మట్టి రహదారులతో ఇబ్బందులు



కాలనీల్లో మట్టి రహదారులే దర్శనమిస్తాయి. ఇళ్లలోని మురుగునీరు మొత్తం మట్టి రోడ్లపైకి చేరుతోంది. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించాలి.

– మునిస్వామి, సత్యసాయినగర్, ధర్మవరం

పింఛన్‌దారుల అర్హత పునఃపరిశీలన

గాండ్లపెంట: మండలంలో రూ.15 వేల పింఛన్‌దారుల అర్హతను జిల్లా వైద్యాధికారుల బృందం పునః పరిశీలించింది. బుధవారం గాండ్లపెంట, కటారుపల్లి గ్రామాల్లో వైద్యులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వైకల్య ధ్రువీకరణ పత్రాలతోపాటు వైకల్యం ఎంత శాతం ఉందో స్వయంగా పరిశీలించారు. పింఛన్ల పరిశీలనను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఉపేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ పర్యవేక్షించారు. స్థానిక వైద్యాధికారి మహేశ్వరమారుతి, హెచ్‌ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో రూ.15 వేల పింఛన్‌దారుల అర్హతను జిల్లా వైద్య బృందం బుధవారం పునః పరిశీలించింది. జిల్లా వైద్యాధికారులు డాక్టర్ ఉపేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రకుమార్, డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ చందన, నల్లచెరువు వైద్యాధికారి కల్పన రెడ్డి ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సదరం సర్టిఫికెట్లు, వారి వైకల్యాన్ని స్వయంగా తనిఖీ చేశారు. నివేదికలను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.



కటారుపల్లిలో వైకల్య ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

తలుపుల: మండలంలో రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారి అర్హతలను వైద్య బృందం పరిశీలించింది. బుధవారం కర్నూలుకు చెందిన డాక్టర్లు శివకృష్ణ, సుమలత స్థానిక వైద్యాధికారి అష్రాఫ్ పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి సదరం సర్టిఫికెట్లు, వారి వైకల్యాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ రామానాయక్, ఏపీఎం బాబ్జి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాల కుదింపు దారుణం

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం కార్మిక కట్టాలను కుదించడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్లు అయూబ్‌ఖాన్, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్ బాషా మండిపడ్డారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కేవలం నాలుగు కార్మిక కోడ్‌లుగా కుదిస్తోందన్నారు. దీంతో కార్మికుల కనీస వేతనం అమలు కాదని, కార్మికులకు కమిటీలు పెట్టుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, రాయలసీమకు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు మారుతి, సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, చేనేత నాయకులు హరి, వెంకటస్వామి, ప్రజా సంఘాల నేతలు బొగ్గు నాగరాజు, జయ, దస్తగిరి, చౌడమ్మ, జయమ్మ, ఫాతిమా, లక్ష్మీదేవి, వరలక్ష్మి, గంగరత్న పాల్గొన్నారు.

కదిరి టౌన్: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్.నరసింహులు, నాయకులు జగన్మోహన్, ముస్తాక్, అలీ, రామ్మోహన్, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలకృష్ణ, జనార్దన్, రైతు సంఘం నేతలు శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధర్మవరంలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

టీకాలతో వ్యాధుల నివారణ

తాడిమర్రి: టీకాలతో వ్యాధులను నివారించవచ్చని పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడిమర్రి, ఎం.అగ్రహారం, నార్సింపల్లి, కునుకుంట్ల, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, పిన్నదరి తదితర గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌ల్లో ప్రతి బుధవారం, శనివారం అప్పుడే జన్మించిన చిన్నారుల నుంచి ఐదేళ్ల వయసులోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

పుట్టపర్తి టౌన్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలంకు ఈనెల 11న పుట్టపర్తి డిపో నుంచి ప్రత్యేక సర్వీసు నడపనున్నారు. ఈమేరకు డీఎం ఇనయతుల్లా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు వేలూరు గోల్డన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కూడా ఉంటుందని తెలిపారు. వివరాలకు 7382859729, 9959225857, 9440201570 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పద వ్యక్తుల బైండోవర్

కదిరి అర్బన్: యర్రదొడ్డి సమీపంలో మంగళవారం రాత్రి అనుమానాస్పంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బైండోవర్ చేశారు. వివరాలు.. పట్టణంలోని అమీన్‌నగర్‌కు చెందిన బాదల్‌వలీ, నాగేష్, పావగడకు చెందిన వినీత్‌కుమార్ సంచుల్లో కటింగ్ బ్లేడ్లు, స్క్రూడైవర్ తదితర వాటిని పెట్టుకుని గ్రామ సమీపంలో సంచరిస్తుండగా గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ మురళీకృష్ణ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేశారు.

డప్పు కళాకారుల సంఘం ఏర్పాటు

అమడగూరు: ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మండల డప్పు కళాకారుల సంఘాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కమిటీ మండలాధ్యక్షుడిగా మద్దె అంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామాంజినేయులు, ఆదెప్ప, ప్రధాన కార్యదర్శిగా జంపాల రామాంజనేయులు, గౌరవ సలహాదారుగా అల్లాపల్లి రామాంజనేయులుతో పాటుగా కార్యవర్గ సభ్యులుగా మరో ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వేయి గొంతుకలు..లక్ష డప్పులు కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గంగులప్ప, ఉపాధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

విద్యాశాఖపై సమీక్ష

కదిరి అర్బన్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం రాత్రి నియోజకవర్గంలోని ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ వీవీఎస్ శర్మతో కలిసి ఎమ్మెల్యే క్లస్టర్ రీ ఆర్గనైజేషన్‌పై చర్చించారు. స్కూల్స్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఏ విధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసే విషయంపై చర్చించారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

నల్లచెరువు: స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఆటోమోటివ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ రాణా ప్రతాప్ నాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల ఒకేషనల్ విద్యార్థులు ఆటోమోటివ్ నమూనాలు ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్, ట్రైనర్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

నల్లచెరువు: డ్రిప్, స్ప్రింక్లర్లపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ రైతులకు సూచించారు. స్థానిక రైతు సేవాకేంద్రంలో ఏఓ భారతి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏతోపాటు ఏఆర్‌ఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. నల్లచెరువు పంచాయతీలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

'దౌర్జన్యంగా భూమి చదును చేస్తున్నారు'

గాండ్లపెంట: స్థానిక పంచాయితీ కార్యాలయం సమీపంలోని తమ భూమిని కొందరు దౌర్జన్యంగా చదును చేస్తున్నారని నరసింహారావు, పవన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ వాపోయారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. సర్వేనంబర్ 1267లోని 7.55 ఎకరాల భూమిపై తమకు మంగు గోపాలకృష్ణకు మధ్య 1997 నుంచి కోర్టులో వివాదం నడుస్తోందన్నారు. అయితే కొంతమంది నాయకులు దౌర్జన్యంగా భూమిని చదును చేస్తున్నారన్నారు. ఈ విషయంలో తమకు పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

శ్మశాన వాటిక కోసం స్థల పరిశీలన

ముదిగుబ్బ: గుంజేపల్లి వద్ద శ్మశాన వాటిక కోసం బుధవారం తహసీల్దార్ నారాయణస్వామి స్థలాన్ని పరిశీలించారు. ముదిగుబ్బ పాత ఊరు వాసుల వినతి మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి

కదిరి అర్బన్: కౌలేపల్లి వద్ద బుధవారం రాత్రి చిల్లర విషయమై జరిగిన గొడవలో కదిరి అమీన్ నగర్‌కు చెందిన సిద్దార్థ అనే వ్యక్తి గాయాలయ్యాయి. సిద్దార్థ కౌలేపల్లిలోని ఓ దుకాణంలో వాటర్‌బాటిల్ కొన్నాడు. చిల్లర విషయమై అతడికి దుకాణదారులకు మధ్య గొడవ జరిగింది. దుకాణదారులు అతడిపై దాడి చేసి గాయపరిచారు. స్థానికులు బాధితుడిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు నిర్మించాలని వినతి

తనకల్లు: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని సుబ్బరాయునిపల్లి గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్పకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడిమికుంటపల్లి నుంచి సుబ్బరాయునిపల్లి వరకు ఉన్న రోడ్డు చాలా అధ్వానంగా తయారైందన్నారు. రోడ్డుపై కనీసం నడవడానికి కూడా వీలుకావడం లేదని వాపోయారు. గ్రామస్తులు వేణుగోపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హైదర్‌వలి,. చంద్రశేఖర్‌రెడ్డి, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను తప్పక వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల పర్యవేక్షణాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం ఎన్‌ఎస్ గేట్ పీహెచ్‌సీలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం నాగసముద్రం, ప్యాదిండి సచివాలయాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి-ధర్మవరం ప్రధాన రహదారిపై పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాల్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..ధర్మవరం నుంచి తాడిపత్రికి వెలుతున్న టాటా ఏస్ వాహనం , తాడిపత్రి నుంచి బెంగుళూరుకు వెళ్తున్న సిమెంట్ లారీ పోట్లమర్రి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తాడిపత్రికి చెందిన టాటా ఏస్ డ్రైవర్ కార్తీక్ కుమార్ వాహనంలో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో బయటకు తీసి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. కార్తీక్ కుమార్ తండ్రి ఓబులేసు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్: కాళసముద్రం వద్ద కదిరి-అనంతపురం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వివరాలు.. ముదిగుబ్బ మండలం సానేవారిపల్లికి చెందిన గణేష్, ములకవేములకు చెందిన నజీవుల్లా కదిరి నుంచి బైక్‌పై ములకవేములకు బయలుదేరారు. కాళసముద్రం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గణేష్, నజీవుల్లాను స్థానికులు కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గణేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తీసుకెళ్లారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మండల కేంద్రానికి చెందిన పుల్లారెడ్డి, హర్షవర్ధన్ బైక్‌పై అన్నమయ్య జిల్లా గాలివీడుకు వెళ్లి తిరిగి వస్తుండగా వసతిగృహం సమీపంలో ఆవుదూడలు అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

ఆలయానికి గ్రానైట్, టైల్స్ వితరణ

తలుపుల: నూతనకాల్వ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీరాముల గుడికి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్ రూ.90 వేలు విలువైన గ్రానైట్, టైల్స్ వితరణగా అందించారు. మాజీ సర్పంచ్ వెంకటరమణ చేతుల మీదుగా బుధవారం వాటిని ఆలయ కమిటీ సభ్యులు చక్రపాణి, సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి, నారాయణకు అందజేశారు. ఈసందర్భంగా వారు హరిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె ఎన్‌సీడీసీడీ సర్వే, ఆర్బీ ఎస్కే, ఎల్‌సీడీసీ సర్వేపై సిబ్బందితో ఆరా తీశారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ, అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర, సీహెచ్‌ఓ సరస్వతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాల్లో బుధవారం ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ ఆధ్వర్యంలో కంది పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉపేంద్రరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం @ రూ. 3,80,817



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయ హుండీ కానుకలకు బుధవారం లెక్కించారు. రూ.3,80,817 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ఆలయంలో మొత్తం మూడు హుండీలు ఉండగా.. ఇటీవల ఒక హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏఓ నరసింహరాజు, బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివ రాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ గ్రామస్తులకు సూచించారు. బుధవారం ఆయన కాటికోటేశ్వర క్షేత్రంలో ఉత్సవాల నిర్వహణపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి పాటిస్తున్న పద్ధతిలోనే ఉత్సవాలను జరుపు కోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణవేణి, సర్పంచ్ పెద్దశివారెడ్డి, గ్రామ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందులు అధికంగా వాడొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ సనావుల్లా

ధర్మవరం రూరల్: పంటల్లో చీడపీడల నివారణ కోసం అధిక మోతాదులో మందులు వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం ఏడీ సనావుల్లా రైతులకు సూచించారు. బుధవారం బడన్నపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతు రైతులు పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులను వాడొద్దన్నారు. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున ఎకరాకు 200 కేజీల జిప్సం వేసుకోవాలన్నారు. ఏఓ ముస్తఫా, ఏఈఓ అశ్వని తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని శానిటేషన్ అధికారి శివయ్య వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి చిత్రావతి రోడ్డు పరిసర ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్లపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వందన, మోహన్‌కుమార్, నరసింహులు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఏజెంట్ల ఆగడాలను అరికట్టాలి

ధర్మవరం: ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సీపీఐ నాయకులు డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు బుధవారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు ఒక కంతు పెండింగ్ ఉన్నా దాడులు చేయడం, దుర్భాషలాడడం, ఇంటి దగ్గరికి వెళ్లి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం లాంటివి చేస్తున్నారన్నారు. ఏజెంట్లు ఓ గ్రూపు ముఠాగా తయారై అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రధానంగా చేనేత కార్మికులను టార్గెట్ చేసుకున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఏజెంట్ల అరాచకాలను అరికట్టాలని విన్నవించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకట్‌నారాయణ, నాయకులు శ్రీనివాసులు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.